క్లుప్తంగా

సీఐటీయూలో చేరిక

భైంసాటౌన్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. పట్టణంలోని పలువురు అంగన్వాడీ టీచర్లు గురువారం టీఎస్‌జీవో సంఘం నుంచి సీఐటీయూలో చేరారు. ఈమేరకు ఆయన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సులోచన, శైలజ, రేఖ, సవిత, భారత, అరుణ సంధ్యారాణి, పద్మ, సునీత తదితరులు ఉన్నారు.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

ముధోల్: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశపరీక్షకు శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ముధోల్ గురుకులం ప్రిన్సిపాల్ అమృతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

సర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామ పెద్దచెరువు కాలువలో గురువారం ఉపాధిహామీ పనులు చేపట్టారు. ఈసందర్భంగా ముళ్లపొదలు, మట్టి, పిచ్చిమొక్కల పూడికతీత పనులను ఏపీఓ సుగుణ పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో టీఏ రవీందర్, ఎఫ్‌ఏ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపించడంపై హర్షం



ప్రారంభోత్సవంలో కొలాంగూడ ప్రజలు

ఖానాపూర్: మండలంలోని సోమర్‌పేట్ గ్రామానికి నడిచే ఆర్టీసీ బస్సును కొలాంగూడ వరకు పొడిగించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ విన్నపానికి ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు నడిపించడంపై గ్రామస్తులు స్వాగతించారు. గురువారం గ్రామానికి వచ్చిన బస్సుకు తోరణాలు కట్టి ప్రారంభించారు. కొడారి గోపాల్, వాల్‌సింగ్, రాజేందర్, దేవేందర్ తదితరులున్నారు.

నేడు, రేపు క్రీడా పోటీలు

ఖానాపూర్: స్వామి వివేకానందుడి జయంతి పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 5, 6వ తేదీల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ శివకుమార్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో సాయిప్రణీత్, లక్ష్మణ్, భూమేశ్, రాజు తదితరులు ఉన్నారు.

నారుమడి పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో

కుంటాల: వరి నారుమడుల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఈవో గణేశ్ అన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్‌లో చిన్నోళ్ల తిరుపతి అనే రైతు వరినారును పరిశీలించారు. నారు అధిక తేమశాతంతో ఎరుపులోకి మారి ఉల్లికోడు సోకినట్లు గుర్తించారు. దీని నివారణకు 3జీ గుళికలు చల్లుకోవాలని సూచించారు. ఎరుపురంగు తగ్గేందుకు ట్రైసైక్లోజోల్ 1.5 గ్రామును లీటర్ నీటితో కలిపి నారుపై పిచికారీ చేయాలని పేర్కొన్నారు. రైతులు అశోక్, గంగారెడ్డి, సాయారెడ్డి, హన్మంత్‌రావు, సుభాశ్‌పటేల్ ఉన్నారు.

'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు'

ఖానాపూర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కౌన్సిలర్లపై చర్యలు తప్పవని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు టి.రాజగంగన్న అన్నారు. గురువారం పట్టణంలోని జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాసం నేపథ్యంలో కౌన్సిలర్లు పార్టీ నిర్ణయానికి అనుకూలంగా వ్యవహరించాలన్నారు. బీఆర్‌ఎస్ బీఫాం పై గెలిచిన వారికి అవిశ్వాస ప్రక్రియలో పార్టీ విప్ జారీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కె.నారాయణరావు, రామునాయక్, కొక్కుల ప్రదీప్, నరేందర్‌రెడ్డి, సుమన్, శ్రావణ్, గోవింద్, సంతోశ్, బుచ్చాగౌడ్, వెంకటేశ్, నవీన్ తదితరులున్నారు.

పుల్గంపాండ్రికి బస్సు నడపాలి

పెంబి: మండలంలో రోడ్డు సౌకర్యం ఉన్న పుల్గంపాండ్రి గ్రామం వరకు ఆర్టీసీ బస్సు నడిపించాలని సీపీఐ(ఎంల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. మండలంలో 24 పంచాయతీలకు గాను కేవలం మూడు (పెంబి, మందపల్లి, నాగాపూర్) గ్రామాలకే బస్సు వస్తుందన్నారు. రోడ్డు సౌకర్యమున్న ప్రతి గ్రామానికి బస్సు నడిపించాలని కోరారు. నర్సయ్య, మల్లేశ్, గంగన్న, మహేశ్, రాజు తదితరులు ఉన్నారు.

నమోదు కేంద్రాలకు బారులు

- దరఖాస్తుదారులతో కిటకిట
- బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నమోదు కోసం అవస్థలు పడుతున్న జనం



రద్దీగా మీసేవ కేంద్రం



ఆధార్‌కేంద్రం వద్ద వేచి ఉన్న దరఖాస్తుదారులు

భైంసాటౌన్: ప్రజాపాలన పేరిట ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో జనాలు హైరానా పడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకున్నా.. ఒకవేళ జారీ చేస్తే సిద్ధంగా ఉండేందుకు అవసరమైన ధ్రువపత్రాల కోసం ప్రజలు పరుగులు తీస్తున్నారు. అంతేకాక ప్రజాపాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తు ఫారంలో రేషన్‌కార్డుపై ఉన్న కుటుంబీకుల పేర్లు, పుట్టిన తేదీ, ఆధార్ వివరాలు పొందుపర్చాలి. దీంతో ఇదివరకే ఉన్న రేషన్‌కార్డుల్లో తమ పిల్లల పేర్ల నమోదుకు అవసరమైన బర్త్ సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రాల వద్ద, చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు కోసం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరి కనిపిస్తున్నారు.

నమోదు కేంద్రాల్లో కిటకిట...

డిసెంబర్ 28 నుంచి వార్డు, గ్రామసభలు నిర్వహించి ప్రజాపాలన పేరిట ఐదు గ్యారంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మొదట్లో ఆధార్, రేషన్‌కార్డు ఉన్న వారే అర్హులని చెప్పిన అధికారులు.. ఆ తర్వాత రేషన్‌కార్డు లేనివారి నుంచి సైతం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా కొత్త రేషన్‌కార్డులను ప్రభుత్వం త్వరలో జారీ చేయవచ్చనే ఆశతో ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం కొత్త కార్డులు జారీ చేస్తే నమోదుకు సిద్ధంగా ఉండేలా పెళ్లయి రేషన్‌కార్డు లేని కొత్త జంటలు తమకు కలిగిన పిల్లల పేర్ల చేర్పు కోసం ప్రామాణికమైన బర్త్ సర్టిఫికెట్ పొందేందుకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. అలాగే ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలకోసం సైతం అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో మీసేవ కేంద్రాలు దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్నాయి.

ఆధార్ కేంద్రాల వద్ద అదే తీరు..

పెళ్లయి కొత్తగా పిల్లలు కలిగిన వారు తమ పిల్లలకు నూతన ఆధార్ నమోదు కోసం కేంద్రాలకు వస్తున్నారు. ప్రజాపాలనలో భాగంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు దూరమవుతామన్న భావనతో ముందుగానే ఆధార్ నమోదు చేయిస్తున్నారు. అలాగే మహాలక్ష్మి కింద మహిళలకు నెలకు రూ.2500 సాయం నేపథ్యంలో బ్యాంక్ ఖాతా కోసం ఆధార్‌లో సవరణలు, ఫోన్ నంబర్ లింక్, కేవైసీ అప్‌డేట్ కోసం వస్తుండడంతో ఆధార్‌కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వద్దు

ప్రజాపాలన వేదికల్లో ఐదు గ్యారంటీలకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆధార్, రేషన్‌కార్డు మినహా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదు. రేషన్‌కార్డు లేనివారి దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నాం. ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దు.

– ప్రవీణ్, తహసీల్దార్, భైంసా

సైలెంట్‌గా ఉంటే సాఫ్ట్ అనుకోవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం
- ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలుంటాయని హెచ్చరిక



మేడంపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: సైలెంట్‌గా ఉంటే తనను సాఫ్ట్ అనుకోవద్దని.. ఎమ్మెల్యేగా కొత్తగా ఎన్నికయ్యాను తప్ప, రాజకీయాలకు కొత్త కాదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతోపాటు మండలంలోని మేడంపల్లి ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ.. ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే అధికారులు.. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీతోపాటు తనపై బీఆర్‌ఎస్ నేతలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సమస్యలుంటే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అనంతరం డీపీవో శ్రీలత ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, సర్పంచ్ రాజునాయక్, తహసీల్దార్ పరిమల్ బౌమిక్, నాయకులు దయానంద్, రమేశ్, మాజిద్, శంకర్, గంగనర్సయ్య, యూసుఫ్‌ఖాన్, సత్యం, హైమద్ తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత

పెంబి: మండల కేంద్రానికి చెందిన కారోబార్ వద్లూరి జగన్నాథం అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.రెండు లక్షల ఎల్‌వోసీ అందజేశారు. మంజూరైన ఎల్‌వోసీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డికి గురువారం ఖానాపూర్‌లో అందజేశారు. ఇందులో నాయకులు శంకర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ అన్నపూర్ణ మహాదేవ ఆలయంలో కాలభైరవ స్వామి వార్షిక మహోత్సవం గురువారం నిర్వహించారు. పండితులు కీర్తి రాఘవశర్మ, రాజశేఖర్‌శర్మ, రవిశర్మ, చంద్రశేఖర్, వెంకటేశ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో అష్టభైరవ చండీ ప్రత్యంగిర శత్రు నివారణ హోమం, అన్నపూర్ణ దేవి, కాలభైరవ స్వామి మూలమంత్ర హోమాలు, రుద్రఅన్నపూర్ణ హోమం, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈఉత్సవాలకు ఆదిలాబాద్ గోపాలకృష్ణమఠం యోగానంద సరస్వతి మహారాజ్ హాజరై ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాలేరి జనార్దన్ తదితరులున్నారు.

రెండో రోజుకూ కార్మికుల నిరసన

- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు



కార్మికులకు మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

నిర్మల్‌టౌన్: పారిశుధ్య కార్మికులను గౌరవించి, వారికి ఎప్పటికప్పుడు వేతనం అందించాలని బీఆర్‌ఎస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడారం ప్రదీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన గురువారం రెండో రోజు కొనసాగింది. ఈసందర్భంగా బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు వారికి మద్దతు తెలిపారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వాలని కోరారు. జీతాలు ఇవ్వకుండా నిధులను పక్క తోవ పట్టించారని మున్సిపల్ కమిషనర్ రాజును నిలదీశారు. మున్సిపల్ చైర్మన్ బినామీ లకు కాంట్రాక్టులు ఇచ్చి నిధులు మళ్లిస్తున్నారని.. లెక్కలు తేల్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పురస్తు చిన్నయ్య, సైండ్ల శ్రీధర్, ఎడపెల్లి నరేందర్, నల్లూరి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్
- లోకేశ్వరం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

లోకేశ్వరం: సమాజంలో చదువుతోనే గుర్తింపు, గౌరవం లభిస్తుందని.. విద్యార్థులు కష్టాన్ని, ప్రతిభను నమ్ముకొని మెరుగైన ఫలితాలు సాధించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, డీఐఈవో జాదవ్ పరశురాంతో కలిసి ప్రారంభించారు. చదువులకు ఇబ్బంది రాకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులకు భోజనం అందించేందుకు ముందుకొచ్చిన దాత, కళాశాల అధ్యాపకుడు కారేగాం వినోద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం కార్గం వినోద్ మాట్లాడుతూ ఒక రోజుకు రూ.5 వేల ఖర్చు అవుతుందని.. వార్షిక పరీక్షలు ముగిసే వరకు భోజనం అందిస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తుకారాం, ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు, నరహరి, సాయన్న, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ధర్మోరలో దరఖాస్తులు స్వీకరణ

మండలంలోని ధర్మోరలో ప్రజాపాలన సభలో ఎమ్మెల్యే రామారావు పటేల్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు స్థానిక బీజేపీ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ శారద, ఇన్‌చార్జి ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రమేశ్, తహసీల్దార్ మోతీరాం, శ్రీనివాస్‌రావు, సంజీవ్‌రెడ్డి, భోజన్న తదితరులున్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



మునిపెల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ పద్మ



పెంబి: మందపల్లిలో స్వీకరిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, బాబాపూర్, రాచాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. రాచాపూర్‌లో అభయహస్తం కోసం 594 దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 178 దరఖాస్తులు, బాబాపూర్‌లో అభయహస్తం కోసం 298, రేషన్‌కార్డుల కోసం 93 దరఖాస్తులు, మునిపెల్లిలో అభయహస్తం కోసం 127, రేషన్ కార్డుల కోసం 50 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీపీ అడ్వాల పద్మ, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఏఈ మహేశ్, ఏపీవో వాణిశ్రీ, ఏపీఎం ప్రమీల, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలకోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపడుతుందని జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పచెలిమ, పెండల్‌దరి, సారంగాపూర్, జౌళి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. సారంగాపూర్ సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పద్మ, నర్సయ్య, సలీం, వీరయ్య తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని ఆరెపల్లి, గాయిద్‌పల్లి, తోటిగూడ, రాశిమెట్ల గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీకళ, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో ప్రజల నుంచి మండల ప్రత్యేకాధికారి అంబాజీ దరఖాస్తులు స్వీకరించారు. వైస్‌ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ సుధాకర్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, గంగారెడ్డి అధికారులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో రహీం, కార్యదర్శి రాజబాపు, సతీశ్, రాజు, ఉత్తం, సారిక, సుమన్ పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలో ప్రజాపాలన వేదికలో గురువారం దరఖాస్తుల స్వీకరణను ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ పరిశీలించారు. కల్యాణ మండపంలోనూ కౌంటర్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ విఠల్, ఎంపీవో మోహన్‌సింగ్, కార్యదర్శి జలంసింగ్, టీఏ రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై అసంతృప్తి

లోకేశ్వరం:మండలంలోని పంచగుడిలో ప్రజాపాలన వేదికలో ఏర్పాట్లు సరిగా లేక కార్యదర్శి లక్ష్మిపై మండల ప్రత్యేకాధికారి రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మోరలో దరఖాస్తుల స్వీకరణ అనంతరం పంచగుడి రావడం కొంత ఆలస్యమైంది. దీంతో ఒక్కసారిగా దరఖాస్తులు అందించేందుకు జనం రావడంతో గందరగోళం ఏర్పడింది.

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం, చింతల్‌బోరి, మిర్జాపూర్, సిద్ధూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కోతల్‌గాంలో గ్రామసభను డీఎల్‌పీఓ శివకృష్ణ సందర్శించారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, అధికారులు ఉన్నారు.

8న సీపీఎం ప్లీనరీని జయప్రదం చేయాలి

ఖానాపూర్: జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఈనెల 8న నిర్వహించే పార్టీ ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డాకూరి తిరుపతి అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్లీనరీలో ఇది వరకు చేసిన పోరాటాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేస్తామన్నారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి, జిల్లా ఇన్‌చార్జి అడివయ్య, పార్టీ నాయకులు హాజరవుతారని.. కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



కడెం: క్యాలెండర్లతో డీఆర్డీవో విజయలక్ష్మి, సిబ్బంది

కడెం: అర్హులందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని పెద్దబెల్లాల్‌లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర నిర్వహించారు. ఆయుష్మాన్‌భారత్, పీఎం కిసాన్ యోజన, జన్‌ధన్ యోజన, ఉజ్వల యోజన, తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇందులో తహసీల్దార్ రాజేశ్వరి, బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్, ధర్మాజీ రమేశ్, సర్పంచ్‌లు రమాదేవి, దివ్య తదితరులున్నారు.

లక్ష్మణచాంద: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం మండలంలోని పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద గ్రామాల్లో కళాజాత బృందం సభ్యులు కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వద్యాల్ టీజీబీ మేనేజర్ రాజ్‌కుమార్ పొదుపు, బీమా పథకాలను వివరించారు. సర్పంచ్ హైమావతి, బీజేపీ నాయకులు రాజు, అశోక్, వీడీసీ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్‌కే అధిక ఓట్లు'

ఖానాపూర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ అధిక ఓట్లు సాధించిందని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 13,07,985 ఓట్లు పోల్ అయితే.. సమీప ప్రత్యర్థి బీజేపీ కంటే బీఆర్‌ఎస్‌కు 16,515 ఓట్లు ఎక్కువగా వచ్చాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ పోటీకాదని.. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు మధ్యే పోటీ ఉంటుందన్నారు. ప్రస్తుత ఎంపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కేంద్రం గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. త్వరలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. సమావేశంలో అంకం రాజేందర్, ఖలీల్, నారాయణరావు, రాజగంగన్న, వాల్‌సింగ్, సుమన్, గోపాల్, నరేందర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, మురళి, గోవింద్, ప్రదీప్, రాజు తదితరులున్నారు.

జీయర్ గురుకులంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కడెం: విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని అల్లంపల్లి గ్రామ జీయర్ గురుకులంలో ఎకోస్ ఆఫ్ ఇండి యా అమెరికా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. సంస్థ నిర్వాహకులు ప్రణమ్య సూరి మాట్లాడుతూ తన తండ్రి వసంత్‌తో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు నల్గొండలో 21 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. గురుకులంలో 22వ ప్లాంట్‌ను గురువారం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(జెట్) అధ్యక్షుడు ప్రభాకరావు, శాంతారాం స్వామీజీ, ఊర్మిల, హెచ్‌ఎం చక్రధర్, ఎస్‌ఆర్‌ఐలు హరిచరణ్, నరేందర్, స్వర్ణలత, బాలరాజు ఉన్నారు.





నిర్లక్ష్యంగా వదిలేశారు..

జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం(పాతకలెక్టరేట్) ఆవరణలో అప్పటి కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి సుమారు రూ.10 లక్షలు వెచ్చించి రెండు ఎల్‌ఈడీ బోర్డులను ఏర్పాటు చేశారు. చిన్న తెరలో జిల్లాలోని వాతావరణం వివరాలు, పెద్ద బోర్డులో ప్రభుత్వ పథకాలను ప్రసారం చేసేవారు. కానీ ఈ ఎల్‌ఈడీ తెరలు కొద్దిరోజులుగా పనిచేయడం లేదు. వీటికి మరమ్మతులు చేసి నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సంక్షిప్త వార్తలు

రాములోరి అక్షింతలు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో గురువారం అయోధ్య రాములోరి అక్షింతలు, రామమందిరం చిత్రపటాన్ని ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామస్తులు సురేశ్, రాజు, శివకృష్ణ ఉన్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాంధీచౌక్, కాల్వగడ్డ కాలనీలో గురువారం అయోధ్య శ్రీరాముని స్పర్శ అక్షింతలు, ఆలయ చిత్రపటం, కరపత్రాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గతంలో కర సేవకు వెళ్లిన శ్రీనివాస్, అశోక్, రాజేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మెడిసెమ్మ రాజు, కిన్నెర రవి, గవాస్కర్, అభిలాష్, సంపత్, వెంకటేష్, నరేశ్, సతీశ్, మణికంఠ పాల్గొన్నారు.

8 నుంచి క్రికెట్ టోర్నీ

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో ఈనెల 8నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతకు బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 89199 25575, 95425 98876 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

తానూరు: మండలంలోని వడ్‌గాం గ్రామంలోని ప్రజాపాలన కార్యక్రమానికి శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ రానున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

సర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ అల్లూరి రవి అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించి రూ.10వేల నగదును అందజేశారు. కుస్లీ మాజీ సర్పంచ్ సూర భోజన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయాకర్, భోజన్న, వినాయక్‌పటేల్, భూమేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కుంటాల: మండలంలోని శ్రీ వీరాంజనేయ రేణుక ఎల్లమ్మ, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేదపండితులు శ్రీ భగవాన్ జోష్ ఆధ్వర్యంలో గురువారం వేదపఠనం, స్వస్తిహవచనం, దేవతారాధన, రుద్ర ఆంజనేయ, రేణుకా మంత్రహవనం, చండీ హోమం, ధాన్యాధివాసం, జలాధివాసం, హారతి, మంత్రపుష్పం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

సాయిబాబా ఆలయంలో సందడి

కుంటాల: రెండో షిర్డీగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని కల్లూర్‌లో సాయిబాబా ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల మహిళలు సాయినామస్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా వచ్చారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.